


కాశ్మీరు కొండలు

# అద్దం ముందు

కృష్ణమోహనరావు

"ఒకవేళ మళ్లీ చిన్నదానివై పోయావనుకో!" తన ముందొచ్చి నిలుచున్న సుందరమ్మను ప్రశ్నించింది అద్దం. "తిరిగి జీవితాన్ని మళ్ళీ ప్రారంభిస్తున్నావనుకో! తిరిగి ఇదేవిధంగా జీవితం గడపడం నీకు ఇష్టమేనా?"

సుందరమ్మకు ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు. కళ్లు చిట్లించి ఒకసారి తనవైపు చూసుకొంది. ఆమె మనస్సులో తను తన జీవితంలో అనేకపరిస్థితులలో అనేక పర్యాయాలు ఇదేవిధంగా నుంచొని ఉండడం తలచుకొంది.

"ఇదిగో చూడు—నా జీవితంలో అనేక అనుభవాలు కలిగాయి. కష్టాలు అనుభవించాను. సుఖాలు అనుభవించాను..."

అద్దం ఫక్కున నవ్వింది. సుందరమ్మతో ఇదే తంటా: కదిపితే చాలు తన కథంతా చెప్పి విసిగిస్తుంది. అంటే, అందరితో మొఱపెట్టుకొంటుందని కాదు. ఈ అద్దానికి సుందరమ్మకూ తెగని స్నేహం. తనని సుందరమ్మతో పాటు అత్తారింటికి పంపించారు. సుందరమ్మ అత్తారింటికి వచ్చేయడానికి ఒక రోజు ముందర వాళ్లమ్మ తన ముందు నుంచొని ఘొల్లుమని ఏడ్చింది. తనకు గుండె తరుక్కుపోయింది.

"ఓహో! మొదలెట్టావూ? నీ కష్టాలు నీ సుఖాలూ నాకు తెలియవనా? అమ్మ పుట్టింటినివదించి మేనమామ మనస్సులో చెప్పినట్టుగా ఉంది చాల్లే, తల్లీ, చాల్లే!"—అద్దం తిరిగి నవ్వడం ప్రారంభించింది.

"సుందరమ్మ నవ్వలేదు. ఇటువంటప్పుడు తనతో పాటు సుందరమ్మకూడా నవ్వేయడం ఆచారం. అద్దం తెల్లబోయింది. సుందరమ్మ తన మాటలు వినిపించుకొన్నట్లు కూడా లేదు. ఆమె తన ధోరణిలో తను ఉంది. అద్దంకూడా వినడం ప్రారంభించింది.

"...కష్టాలలోకూడా సుఖాలు ఇమిడి ఉంటాయి. అలాగే సుఖాలవిషయం కూడాను. ఒకప్పుడు మనం తిట్టుకొన్న కష్టాలే సుఖాలకు దారితీస్తాయి. మనకష్టాలు సుఖాలుగా మారిపోతాయి. మనం అనుకొంటాం: 'ఈ జరిగిన వాటివల్ల ఒక పాఠం నేర్చుకొన్నాం. ఇక ముందు ఇటువంటి పరిస్థితులలో మనం ఈ విధంగా ప్రవర్తిద్దాం; ఈ విధంగా ప్రవర్తించొద్దూ' అని.

కాని తీరా సమయంవచ్చేవరకు ఈ అనుభవాలెంగుకూ పనికిరావు.

"మగాళ్ల సంగతి నేను అట్టే అంత చెప్పలేను, కాని ఆడవాళ్లం తెలివితేటలకంటె ఉద్రేకాలకే ఎక్కువ లొంగుతామేమో అనుకొంటాను. బహుశః మగాళ్ల సంగతికూడా అంతే అయిఉంటుంది."—సుందరమ్మ

గాలి రివ్వున వీచింది. సుందరమ్మ చిన్నకొడుకు పదేళ్లవాడు రామం బల్లమీద పేకతో మేడకడుతున్నాడు. గాలికి మేడ కూలిపోయి, పేకముక్కలన్నీ గల్లంతుగా కింద పడిపోయాయి. ఇస్పేటురాణీమాత్రం, అరకు ఆరుని ఆనుకుని సంతోషంగా నిలుచునింది.

అద్దం అడిగింది. "నీ వేదాంతం సరే కాని, సుందరమ్మా! ఈవాళ పొద్దున్న నువ్వు ఏడ్చావు కేనికి?"

"నీ కెల్లా తెలిసింది?

"నువ్వు మొహం కడుక్కొని నా దగ్గర కొచ్చినప్పుడు నీ కళ్లెఱ్ఱగా ఉన్నాయి"

"పొద్దున్న మీ అన్నగారికి బాగా కోపంవచ్చింది. ఇద్దరం పోట్లాడుకొన్నాం. మామూలేగా! చేతులో ఉన్న గ్లాసు విసిరి కొట్టేరు. కొంచెంలో తప్పిపోయిండి."

"నీకు తప్పిపోడమేమిటి? గుమ్మంలోంచి వచ్చి నా దగ్గరకొచ్చి పడితేను. ఏదో ఈ నేలమీద ఇంకా కొన్నాళ్లు ఆయుస్సుండబట్టి బతికిపోయానుగాని, లేకపోతే నా కోసం ఏడవడంకూడా మానేసేవా రీపాటికి! అది సరేకాని, అమ్మాయి గురించేనా తగాదా?"

సుందరమ్మ తల ఊపింది. ఆమె కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. సుందరమ్మకూతురు రాధ 'ప్రాబ్లెమ్ ఛైల్డ్' అఖండమైన తెలివితేటలున్నాయి దగువుంది. ఆడవాళ్లందరికి అందంగా ఉన్నామనే గర్వం సహజం. రాధకి ఆడదైపుట్టినందుకే గర్వం" ఆమెను చూసినప్పుడల్లా సుందరమ్మ కనిపిస్తూంటుంది. ఆడవాళ్లకు తెలివితేటలుండడం ఒక విధంగాచూస్తే వారికీ ఇతరులకీ కూడా ప్రమాదమేమోనని మగవాళ్లను ఆడవాళ్లను తయారుచేసేటప్పుడు భగవంతుడు రెండు రకాలు పదార్థాలను ఉపయోగిస్తాడేమో అనిపిస్తుంది. ఆడవాళ్లు ఒక వస్తువుని చూసినప్పుడు దాని మంచిచెడ్డలనుగురించి ఆలోచించరు వారిలో ఉండే ఓ గ్రహింపుశక్తి వల్ల ఆ వస్తువులోని 'మూలాన్ని' గ్రహిస్తారు. మగవాళ్లు అల్లా కాదు; వారు వస్తువుని గురించి మంచిచెడ్డ లాలోచించి ఒక నిర్ణయాని కొస్తారు. ఈవిధంగా చూస్తే దేముడు కూడా ఆడవాళ్లంటే కొద్దిగా పక్షపాతం చూపిస్తున్నాడేమో అనిపిస్తుంది. ఇదంతా ఆయన కెల్లా అర్థమవుతుంది? సుందరమ్మ తన కూతురును గురించి బాధపడుతోంది అంటే ఎందుకో ఆయనకు అర్థంకాదు. ప్రయత్నించాడు కాని అర్థంకాలేదు. ఎల్లా అర్థమవుతుంది? ఇద్దరూ జీవితంలో రెండు బాటల వెంబడి నడుచుకొంటూ వచ్చారు. ఒకచోట కలిశారు. అక్కడ నుండి ఇద్దరూ కలిసే ప్రయాణం చేశారు. అయినప్పటికీ తను వచ్చిన బాటనంటిన దృశ్యాలు ఆమె హృదయానికి హత్తుకుపోయాయి. అల్లాగే అతనికి కూడా. ఆమె దృక్పథాన్ని అర్థంచేసికొని ఆమె వచ్చిన బాటను సానుభూతితో ఊహించుకోగల శక్తిని భగవంతుడు అతనికి ఇంకా ఇవ్వలేదు. అందుకనే అతనికి ఆ పిచ్చికోపం! అతని అభిప్రాయాలతో ఆమెకు సానుభూతి ఉంది. అయితే తనను అర్థం చేసికోడని ఆమెకు కోపం!

ఇద్దరి సంగతీ అద్దానికి బాగా తెలుసు. అందులో ముఖ్యంగా సుందరమ్మ సంగతి. తీరిక ఉన్నప్పుడల్లా సుందరమ్మ అద్దం ముందుకు వెళ్ళి మంతనా లాడుతుంది. అద్దంకూడా ఆమెతో మనసిచ్చి మాట్లాడుతుంది.

సుందరమ్మ తల్లితండ్రులు పేదవారు కారు; అయితే ధనికులు కూడా కారు. సుందరమ్మ చాలా తెలివయిందని చెప్పడానికి వీలేదు; కాని తెలివి తక్కువదీ కాదు. నడిచేటప్పుడు సాధ్యమయినంతవరకూ దారిలో ముళ్ళను తొక్కకుండా నడుస్తుంది. కాని ఒక్కొక్కప్పుడు అనుకోకుండానే ముళ్లు గుచ్చుకొంటాయి. గుచ్చుకొన్నాయి కదా అని కొందరు ఆడవాళ్లు పెద్ద గంద్రగోళం చేస్తారు. ఇతరుల బాధలను తాము అర్థం చేసుకోలేకపోయినా తమకు ఒకింత నెత్తురు ఒలికితే భూకంపం వచ్చినంత కంగారు పడతారు. సుందరమ్మ అటువంటిది కాదు. ఆమె తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఒక పాఠశాలగా తీసుకొంది. చుట్టూ తిరిగే వ్యక్తులందరూ ఆమెకు ఉపాధ్యాయులే. ఆమె తనకు గుచ్చుకొన్న ముళ్ళనుచూసి చాలా బాధపడేది. అయితే తనకు గుచ్చుకొన్న ముళ్లు ఇతరులకు కూడా బాధ కలిగిస్తాయని ఆమె తెలిసి ప్రవర్తించేది. తన ప్రవర్తనవల్ల ఇతరులకు ఎక్కడ బాధ కలుగుతుందో అని మెలకువతో ప్రవర్తించేది. ఆమె ఇతరుల యెడ మితిలేని సానుభూతిని వ్యక్తంచేసేది.

సానుభూతి చాలా విచిత్రమయింది. మనకు ఇతరుల కష్టాలయెడ సానుభూతి కలుగుతుంది. వారీసానుభూతికి కృతజ్ఞత వలిబుచ్చరు పయిగా తమ ప్రయోజనాల కోసం దానిని దురుపయోగం చేసికోడానికి ఎంచుస్తారు. ఇదీ సుందరమ్మ అనుభవం

సుందరమ్మ తన అనుభవాలన్నీ ఎన్నో సార్లు చెప్పింది.

"అప్పుడు నాకు పదిహేను పదహారు సంవత్సరాలు వయస్సు అంతవరకు పురుషులంటె నాకు ఒక విధమయిన ఏహ్యం ఉండేది కాని అప్పుడు నాలో—లోలోపల ఏవో వాంఛలు పెరగడం ప్రారంభమయ్యాయి నా అందాన్ని, నా అలంకరణాన్ని, నా పనులనీ పురుషులు చూడాలనీ; అభినందించాలనీ కోరికలు నాలో పెరగడం ప్రారంభం అయ్యాయి. పురుషులందరూ పశువుల్లాటివారనీ, వాళ్లు పశువు




ఎస్ట్రెలా బ్యాటరీస్ లిమిటెడ్. బొంబాయి—మద్రాసు—ఢిల్లి—నాగపూరు—కాన్పూరు—కలకత్తా.

ల్లాగే ప్రవర్తిస్తారనీ మా అక్కయ్యల్లాగే నేనూ నమ్ముతూండేదాన్ని. అయితే ఏ పురుషుణ్ణి చూసినా అతడు తప్ప మిగతావాళ్లందరూ పశువులని భావిస్తూండేదాన్ని.

"అప్పట్లో మా ఇంటిపక్కని ఈశ్వరయ్య అనే కుర్రాడుండేవాడు. కుర్రాడంటే కుర్రాడు కాదులే, - పెద్దవాడే! పత్రికల్లో కథలూ వ్యాసాలూ రాస్తూండేవాడు. చిన్నప్పుడు చాలా నెమ్మదిగా వుండేవాడు. ఆడవాళ్ళూ, మగవాళ్ళూ సమానం అనీ ఆడవాళ్లు వంటిళ్లల్లోంచి బయటకు వచ్చి ప్రజలలో తిరిగి మెలగాలనీ అంటూండేవాడు. సాంబయ్యగారబ్బాయి. మన ఊరే వాళ్లది. సన్నగా, పొడుగ్గా.."

సాంబయ్యగారు బాగా డబ్బున్న రైతు.




# అద్దం ముందు

ఒక్కడే కొడుకు కావడంవల్ల వాళ్ళ వంశంలో ఆచారం లేకపోయినా పెద్ద చదువులు చెప్పించాడు అతడు అప్పుడప్పుడు సుందరమ్మగారింటికి వస్తూండేవాడు. కాని పెద్ద అయిన తరువాత చాలా చెడ్డపేరు తెచ్చుకున్నాడు అతనికి ఎవ్వరూ పిల్లనివ్వడానికి ఇష్టపడలేరు. తండ్రితో కూడా సంబంధాలు తెగతెంపులు చేసుకొన్నాడు.

సరిగ్గా పక్కింట్లోనే ఉండేవాడతను. నలుగురు కుర్రాళ్ళను చేరదీసి, ప్రేమమీద, సంఘంలో స్త్రీల పరిస్థితులనుగురించి ఉపన్యాసా లిస్తూండేవాడు. పాలిపోయిన అతని మొహం అది చూస్తే జాలివేసేది సుందరమ్మకి.

అతడు అప్పుడప్పుడు సుందరమ్మవాళ్లింటికి వచ్చేవాడు ఏదయినా పనుంటే. ఒక రోజున అతడు వచ్చేసరికి ఇంట్లో ఎవరూ లేరు. మామ్మ ఉంది కాని ఆవిడ ఎక్కడో లోపల పడుకొనిఉంది. నాన్న, అమ్మ- ఇద్దరూ కూడా ఇంట్లో లేరు. నాన్న ఊరెళ్ళారు. అమ్మ అగ్రహారంలో కాంతమ్మగారింటికి వెళ్లింది.

అతడు సావిట్లోకి వచ్చి పిలిచాడు; తను వెళ్లింది. అతడిని సంఘం హింసిస్తోంది. ఎందుకు? తన అభిప్రాయాలను నిష్కర్షగా పైకి చెప్పగలిగినందుకు. "మిమ్మల్ని అర్థం చేసుకొనే వ్యక్తి ఒక్కతయినా ఉంది" అని అతగానితో ఎప్పుడయినా చెప్పాలని సుందరమ్మ ఉద్దేశ్యం.

సుందరమ్మ గుమ్మంలోకి వెళ్లి "నాన్నగారు ఊరెళ్లారు; రేపొద్దున కాని రారు" అంది

అతడు తనవైపు రెండు క్షణాలు చూశాడు: "మీ రెంతవరకూ చదువుకొన్నారండీ?" అని అడిగాడు.

సుందరమ్మ తెల్లబోయింది. ఒక్క నిమిషం ఆగి "థర్డ్ ఫారం పేసయ్యా" అంది, తన చదువుకి తనకే సిగ్గేసింది. అతను వెళ్లిపోయాడు.

అతడి గది వాళ్ళ గోడ నానుకొని ఉండేది. దానికి కిటికీలు లేకపోయినా గాలి రావడానికి పయిన గోడకు కన్నాలు ఉండేవి. తను పెరట్లో చెట్టునీడను కూర్చుంటే అతని ఉపన్యాసాలన్నీ వినబడేవి. తను అక్కడ కూర్చొంటుందని అతనికి తెలుసా? ఏమో, తెలిస్తే తెలిసుండొచ్చు అనుకుంది సుందరమ్మ. మర్నాడు అతడు రోజూకంటె గట్టిగా మాట్లాడుతున్నాడు. సంఘంలో కొందరు మగవాళ్లుంటారనీ, వారు పెద్దమనుష్యుల్లాగే చలామణీ అవుతుంటారనీ, ఇతరుల విషయాలలో విశాల హృదయులేననీ, తమ ఇంట్లో ఆడవాళ్ళను మాత్రం అణిచేస్తారనీ చెబుతున్నాడు. దానితరవాత తనెరుగున్న ఒక పెద్దమనిషినిగురించి ఉదాహరణంఇచ్చాడు. సతని మాటలు వింటున్నకొద్దీ అతడు తన అంగతే చెబుతున్నాడని అర్థం అయిపోయింది తనకు. తను వినాలనే కాబోలు చాలా గట్టిగా మాట్లాడుతున్నాడు.

సుందరమ్మకు బాగా కోపం వచ్చింది. నాన్నంటే తనకు చాలా ఇష్టం. తనను ఎంతో ప్రేమగా చూస్తాడాయన. తనకు చదువుకోవాలనిఉండంటే తప్పక చెప్పించేవాడే తనే అడగలేదు. ఈశ్వరయ్య నాన్నను బాగా అర్థంచేసికోలేకపోయారు అనుకొంది సుందరమ్మ

ఆవేళ రాత్రి నాన్న భోజనంచేస్తూంటే సుందరమ్మ అంది "నిన్న మధ్యాహ్నం ఈశ్వరయ్యగారు వచ్చారు, ఎందుకో, నాన్నా!"

నాన్న ఉలిక్కిపడిచూసి, "ఎందుకూ?" అన్నారు.

"ఏమో చెప్పలేదు మీరు లేరంటే వెళ్లిపోయారు'

"నువ్వెందుకు పలికావు? అమ్మ లేదా ఇంట్లో?"

"అమ్మ కాంతమ్మగారింటికి వెళ్లింది."

"రౌడీ వెధవ! పోని సాంబయ్యగారి కొడుకుగదా అని ఊరుకొంటూంటే!— నిన్న నేను ఊరు వెళ్లడం చూసి పలకరించిన వెధవ మధ్యాహ్నం ఇంటికొచ్చాడన్న మాట నాకోసం."

సుందరమ్మ తెల్లబోయింది. ఆయన ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉంటాడు. పరధ్యానంగా ఉండి మరిచిపోయుండొచ్చు అనుకొంది. అప్పటినుంచి రెండు మూడు రోజులు ఇదే ఆలోచించడం ప్రారంభించింది. నాన్న, ఈశ్వరయ్య—ఇద్దరూ మంచివారే. కాని ఒకళ్ళనొకళ్లు అర్థంచేసికోలేకపోతున్నారు. ఇంకా అతను నాన్నను అర్థంచేసికోలేదంటే ఆశ్చర్యంలేదు. కాని నాన్న అతన్ని అర్థంచేసికోలేదంటే? అది వింతే. ఇంత వయస్సువచ్చి, ఇంతమంది మనుష్యుల్ని చూసినతర్వాతకూడా!

పైగా—ఈశ్వరయ్య నిజంగా రౌడీ అయితే తనముందు అంత సౌమ్యంగా ఎందుకు ప్రవర్తిస్తాడు? అతను వచ్చాడు; 'మీ నాన్నగారున్నారా?' అని అడిగాడు; 'నువ్వేం చదువుకొన్నావ్?' అని అడిగాడు; వెళ్ళిపోయాడు. తనవైపు చూసినా ఏదో సిగ్గుపడుతూ సిగ్గుపడుతూ చూశాడు. రౌడీ అయితే అల్లా ఎందుకు ఉండేవాడు?

నాన్న, అందరూ కూడా ఆ సుబ్బారావుని మంచివాడంటారు. తనని అతనికి ఇద్దామని అనుకొన్నారు కూడా. ఆ వేళ భోజనానికి వచ్చిన రోజున తమలపాకులు ఇద్దామని వెడితే ఎవరూ లేకపోడం చూసి చెయ్యి పట్టుకొన్నాడు. వళ్లు ఝల్లుమంది. అరుద్దామనుకొంది కాని; మళ్ళీ ఎందుకా రభస అని ఊరుకొంది. ఒక నవ్వునవ్వేసి చక్కావచ్చింది. మరి అతన్ని అందరూ మంచివాడని అంటారు. ఇల్లా ఎంతమందిని


చర్మపుబాధలన్నిటికి

"సైబాల్"




చర్మవ్యాధు లన్నిటిని శీఘ్రంగా నివారణచేసి, విష క్రిమి నాశనియై త్వరితంగా కుదుర్చుటలో "సైబాల్" ప్రసిద్ధికెక్కింది. కురుపులు, గజ్జి, ఎక్జిమా, స్కాబిస్, మొటిమలు, తామర, కాళ్లపగుళ్లు, వ్రణములు, మొదలైన వాటిని కుదుర్చడంలో అద్భుతంగా పనిచేస్తుంది.

బిడ్డల ఆరోగ్యమునకు ప్రసిద్ధిచెందినది,

"రమణీస్ బేబి గ్రైప్"




తయారీదార్లు

దిసౌత్ ఇండియన్

మాన్యు ఫాక్చరింగ్ కంపెని, మధుర.

డిస్ట్రిబ్యూటర్లు:

సీతారామ జనరల్ స్టోర్సు ఏజెన్సీస్

విజయవాడ, సికింద్రాబాద్.

బరంపురం (గంజాం), బొంబాయి.

అల్లరి చేస్తున్నాడో ఎవరికీ తెలియకుండా!

ఈశ్వరయ్యను అందరూ తప్పర్థం చేసుకొంటున్నారు. అనుకొంది సుందరమ్మ. పోనీ తన సానుభూతిని అతనికి తెలియచేస్తే? "సంతకం పెట్టకుండా ఒక ఉత్తరం రాస్తాను. దస్తూరి మార్చిరాస్తే సరి! ఎవరు రాసిందీ అతను అర్థంచేసికోగలడు!"

మర్నాడు ఈశ్వరయ్య పేర ఒక ఉత్తరం రాసి అతని గదిలోకి గోడ కన్నం లోంచి పడేసింది సుందరమ్మ.

అద్దం కొంటెగా నవ్వింది — గడుసు దానివే అన్నట్టు.

"ఈ ప్రపంచకమంటే ఏమిటనుకొన్నావ్! అమాయకంగా కనబడి గొంతులు కోసేస్తారు." అంది సుందరమ్మ. "ఉత్తరంలో ఏం రాశానో జ్ఞాపకంలేదు, అక్కడక్కడ తప్ప. మొదట స్వార్థం లేకుండానే ఆయన స్త్రీలయెడ తీసుకొంటూన్న శ్రద్ధకు అభినందనలు తెలిపాను. 'మీ విజ్ఞానానికి, మీ సంస్కృతికి మీ పయిన నాకు విపరీతమయిన గౌరవం కలిగింది. మీలాంటి విద్యావంతులేగాని మా స్త్రీ జాతికి నిస్స్వార్థమైన సేవ చెయ్యలేరు. మీరు చేసేసేవకు నా సేవకూడా జోడించి చెయ్యాలనిఉంది. కాని నావంటి నిస్సహాయ అయిన స్త్రీ దేశానికి సేవ ఎల్లా చేస్తుంది?' అంటూ ఇల్లాగే ఏదో రాశాను" అంది సుందరమ్మ.

తనకి అతన్ని పెళ్లి చేసుకొంటే బాగుండు ననిపించింది. "మీ కభ్యంతరం లేకపోతే నేను మిమ్మల్ని పెళ్ళాడుతాను. సంఘం మనలను ఏమన్నా లెక్క చెయ్యవద్దు. మనం సంఘాన్ని ఎదిరిద్దాం" అని తనెల్లా రాస్తుంది? అందుకే తను రాసింది 'మీరు చేసే సేవకు నా సేవకూడా జోడించి' అని. అతడు చాలా తెలివయినవాడు. అర్థంచేసుకొంటాడు.

ఉత్తరం పడేసిన తర్వాత సుందరమ్మ చాలా విచారించింది. ఒకవేళ ఆ ఉత్తరం పడేసిన సమయానికి ఆ గదిలో ఇంకెవరయినా ఉంటే? ఆ ఉత్తరం వేఱొకరి చేతులో పడితే అతనికీ తనకీకూడా చాలా చెడ్డపేరు వస్తుంది.

ఉత్తరం పడేసిన రెండు మూడు రోజుల వరకూ ఏమీ జరగలేదు. పెరట్లోకి వెడితే అటునుంచి ఏం మాటలు వినబడతాయో నని అటు వెళ్లడం కూడా మానేసింది. ఒక రోజున అతడివద్దనుండి జవాబు వచ్చింది. నాన్న ఇంట్లో లేనిసమయంలో అతనే వచ్చాడు. "మీ నాన్నగారి పుస్తకం తీసుకొన్నాను. వారు వచ్చిన తరువాత వారికిచ్చేయండి," అన్నాడు అతను. అందులో ఉంది ఉత్తరం. సుందరమ్మకు భయం వేసింది. 'నాన్నగారు చూస్తే?' అనుకొంది.

అతను ఉత్తరంలో చాలా విషయాలు రాశాడు. 'నన్ను చూసి నువ్వేదో గొప్పవాడని అనుకుంటున్నావేమో. నేనొక పతితుణ్ణి. సంఘంలోని ఘరానా మనుష్యులు ఎవర్నైనా అడుగు చెపుతారు, ఈశ్వరయ్య పచ్చి రౌడీ అని' అంటూ రాశాడు. సుందరమ్మకు ఇక్కడ బాగా జాలేసింది. తన పతనానికి కారణం సంఘమే అన్నాడు. "నేను పడిపోయాను. నాకు లేవాలనే ఉంది. తిరిగి బాగుపడాలనే ఉంది. కాని ఎల్లాగా? నీలాంటిదాన్ని పెళ్ళిచేసుకొంటే నేను తప్పక బాగుపడతాను. కాని నా బాగుకోసం నిన్నెలా పాడుచేస్తాను?... నువ్వు చదువుకో. చదువుకొని నాకంటె బాగా తెలివయినవాణ్ణి; బాగా ధనవంతుణ్ణి, బాగా చక్కనివాణ్ణి పెళ్లిచేసుకో. బాగుపడు."

సుందరమ్మ అతన్నే పెళ్ళిచేసుకోవాలని నిశ్చయించుకొంది. తను అతనికోసం త్యాగం చేస్తుంది. తనవల్ల అతను బాగుపడతాడు. నాన్న వాళ్ళు ముందు కేకలేసినా చివరికి సంతోషిస్తారు.

ఆ తరవాత సుందరమ్మ అతన్ని రెండు








అందరికి అది మంచిది...

❋ ఎందుచేతనంటే అది శుద్ధమైనది

❋ ఎందుచేతనంటే అది పుష్టికరమైనది

డాల్డా వనస్పతి

½ పౌను, 1 పౌను, 2 పౌన్లు, 5 పౌన్లు మరియు 10 పౌన్లు డబ్బాలలో భారతదేశంలో అన్నిచోట్లా దొరుకును.

HVM 239-50 TL



క్రిందపడి కాళ్లూ చేతులూ బెణికితే



అమ్మ అమృతాంజనం వాడింది



వెంటనే తగ్గిపోయింది!

అమృతాంజనము




అన్ని నొప్పులు జలుబులు,
సగ్గులు మొదలైన వాటికి కూడా
అమృతాంజనమే వాడండి.

# ★ అద్దం ముందు ★

మూడుసార్లు కలుసుకొంది. మనిషిని కలుసుకుమాట్లాడుతోంటే ఆమెకు అతనిలో కొన్ని అవలక్షణాలు కనబడ్డాయి కాని మనస్సును ఎల్లాగో అల్లాగ సరిపెట్టుకొంది. తను రెండోసారి చూడడానికి వెళ్ళినప్పుడు అతడు తటాలున తన చెయ్యి పట్టుకుని తన పక్కన కూర్చోపెట్టుకొన్నాడు. ఒకపక్క సుందరమ్మని పెళ్ళిచేసుకోడానికి తను తగనని అంటూనే ఈ పని చెయ్యడం ఆమెకు చివుక్కుమనిపించింది. ఎందుకో ఆమెకు సుబ్బారావు జ్ఞాపకం వచ్చాడు. ఎందుకో? అతనికీ ఇతనికీ పోలికే లేదు.

సుందరమ్మ ముందే జాగ్రత్తపడింది కాని లేకపోతే ఇదంతా ముంచుకుపోయేదే! పదిహేను ఇరవయిరోజులు గడిచిన తర్వాత ఒకనాడు కలుసుకొందామన్న ఈశ్వరయ్య కనబడలేదు. మర్నాడు పొద్దున్న ఊరంతా ఘుప్పుమంది. ఎవరినో లేవతీసుకొని ఈశ్వరయ్య పారిపోయాడు. ఆవిడ తనతో బాటు తన నగలన్నీ తీసుకుపోయిందిట.

* * *

"నాకేం పాలుపోట్లేదు. సరిగ్గా నేను నడిచినబాటనే నడిచివస్తోంది నాకూతురు. నేను కొండకొనవద్దకువచ్చి ఆగాను. పడిపోవలసిందే. కాని దైవవశాత్తు రక్షింపబడ్డాను నా అనుభవాన్ని పురస్కరించుకొని నాకూతురు బాగుపడితే బాగుణ్ణు" - సుందరమ్మ.

ఏంచేసింది అమ్మాయి?

రాధను అన్నానికి పిలుద్దామని రాధ గదిలోకి వెళ్లింది సుందరమ్మ. రెండుమూడుసార్లు పిలిపించుకొన్న తరవాత రాధ చేతిలో పుస్తకం తొందరగా డ్రాయర్లో పడేసి పరుగెత్తుకొచ్చింది. ఆమె తొందర అదీ చూస్తే అనుమానం వేసింది సుందరమ్మకు. డ్రాయర్ లో వెతికితే దొరికింది. ఒక పుస్తకంలో ఉంది ఉత్తరం. రామకృష్ణుడిపిల్లి వేడిపాలెక్కడున్నాయో చటుక్కున కనిపెడుతుంది.

"పెళ్ళికొడు కెవరూ?" అని అడిగింది అద్దం. కొందరికి ఎప్పుడు హాస్యాలాడాలో ఎప్పుడు మానాలో తెలియదు

"ఎవరో రామకృష్ణారావుట. కాలేజీలో లెక్చరర్. ఏమిటి గతి?' అంది సుందరమ్మ ఆదుర్దాతో.

"ఉత్తరం ఏం చేశావ్?" అని అడిగింది అద్దం.

"చింపేద్దామనుకొన్నాను. కాని లాభమేమిటి? ఇంకొకటి రాస్తుంది. పయిగా నాకు తెలిసిందని తెలుసుకొని మరింత జాగ్రత్తపడుతుంది."

"ఓపని చెయ్యి. నీ అనుభవాలన్నీ చెప్పి చూడు. పాఠం నేర్చుకొంటుందేమో చూద్దాం. నాకుమాత్రం నమ్మకం లేదు నిప్పు కాల్తుందని చెప్పితే తెలియదు. ముట్టుకొన్న తర్వాతకాని తెలియదు"

"అయితే అంతా చెప్పేయమంటావా..."

ఊఁ. మీ ఆయన!" అంది అద్దం.

సుందరమ్మ మొగుడు దరదరా నడుస్తూ వచ్చి లోపలికి పోయేడు. అతనితీరు చూస్తే ఆమెకేదో భయం వేసింది. వంటింట్లోకి వెళ్ళి ఫ్లాస్కులో కాఫీ గ్లాసులో పట్టుకొచ్చి ఇచ్చింది.

"నువ్వు పొద్దున్న అన్నమాట ఇప్పుడు నాకు అర్థమయింది" అన్నాడాయన. సుందరమ్మకు అర్థం కాలేదు

"ఏముంది? రాధసంగతి. ఎదిగినపిల్లను పెళ్ళిచెయ్యకుండా ఉంచడం మంచిది కాదు"

పక్కగదిలో రాధ త్రుళ్లిపడింది.

కోర్టులో ఆయనస్నేహితుడు హెచ్చరిక చేశాడు. "ఊళ్లో పుకార్లు చాలా ఉన్నాయి. ఆ రామకృష్ణారావు దుర్మార్గుడు. నీకూతుర్ని జాగ్రత్తచేసుకో" అని.

ఆ వేళ రాత్రి రాధను కూర్చోపెట్టి సుందరమ్మ తనకథంతా చెప్పుకొచ్చింది.

రాధ అంది: "అమ్మా! నువ్వీ కథ నాకెందుకు చెబుతున్నావో నాకు తెలుసు. రామకృష్ణారావుగారు దుర్మార్గుడని అతన్ని పెళ్ళిచేసుకోవద్దని కాదూ? మీ ఇష్టప్రకారమే చెయ్యండి. నేను కాదనను."

సుందరమ్మ నిర్ఘాంతపోయింది. రాధ లేచి వెళ్ళిపోయింది. గాజు వంగదు. పగిలిపోతుంది ఉక్కు వంగిపోతుంది. విరగదు. ఉక్కు తీగను తెంపడం అసాధ్యం.

* * *

రెండుమూడు రోజుల తర్వాత రాధ జడ వేసుకొంటోంది.

"నీ పెళ్ళిసంగతి ఏమయినట్టూ?" అని అడిగింది అద్దం

"ఏమో! ఎవరికి తెలుసూ? రామకృష్ణారావుగారిని పెళ్లి చేసుకుంటానంటావేమోనని భయపడ్డారు. మీ కిష్టం లేకుండా చేసుకోనని చెప్పాను. రామకృష్ణారావుగారు దుర్మార్గుడట. అయితే అయ్యుండొచ్చు. దుర్మార్గులయినవాళ్లను బాగుచెయ్యడంలోనే ఉంది గొప్ప! సావిత్రినీ అనసూయనీ అందరూ పొగుడుతారు కాని ఇంట్లో ఉండుకోడానికి ఇష్టపడరెవ్వరూ!" అని వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది

అద్దం అంది "నిప్పు ముట్టుకు చూస్తే కాల్తుంది. కాల్తుందని చెపితే ఏమాత్రం తెలుస్తుంది? ఎవరి అనుభవం వారికి కావలసిందే!"

రాధ వినిపించుకోలేదు. ★